క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తున్న శ్రీ నిమిషాంబాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం నుంచి నాలుగు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు, ఆర్యక్షత్రియ చిత్తారి సేవా సంఘం గౌరవాధ్యక్షులు జీనిగిరి నరసింహం, కార్య నిర్వాహక అధ్యక్షులు సీబీ శ్రీధర్‌వర్మ తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను గురించి తెలియజేసే ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరం బెల్లం మండి వీధిలోగల శ్రీ కాశీ విశ్వనాథసహిత శ్రీ నిమిషాంబాదేవి వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు ఉంటాయన్నారు. 10న ఉదయం 6 గంటల నుంచి వివిధ పూజోత్సవాలతో పాటు మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు ఊంజల సేవ, ఏకాంత సేవ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి హరిశర్మతోపాటు సంఘం కార్యదర్శి జేవీఎస్ శశివరకుమార్, ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్య విషయంగా ప్రత్యేక దృష్టి సారించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత తెలిపారు. మంగళవారం కడప నగరం నాగరాజు పేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆశ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న లత మాట్లాడుతూ ×ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్, ఎడ్యుకేషన్, ఆశా కార్యకర్తల విధివిధానాలపై వివరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను బేబీ కేర్ సెంటర్ దగ్గర వదిలేయడం, అక్కడ ఏమి జరుగుతుందో గమనించక పోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా తల్లిదండ్రులు మంచి పౌష్టికాహారంతోపాటు విద్యా బోధనలు నేర్పించాలని, బిడ్డకు వేయవలసిన అన్ని రకాల టీకాలను వేయించి తద్వారా ఎలాంటి అంటువ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణా వైద్యులు డాక్టర్ ప్రియ, డాక్టర్ ముస్కాన్, డాక్టర్ సోను, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మతం.. మనిషి ఆధ్యాత్మిక అభిమతం

కడప రూరల్: మతం అనేది మనిషి ఆధ్యాత్మిక అభిమతమని జీసస్ క్రైస్ట్ కెథడ్రల్ చర్చి బిషప్ కే సామ్యూల్ బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీలు ఇప్పటికీ సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారు. మనిషి ఏమతం మారినా కులం మారదన్నారు. అయితే ఎస్సీలకు మాత్రం క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదాను కోల్పోతారని చెప్పడం తగదన్నారు. మతానికి..కులానికి ఏమిటి సంబంధం అన్ని ప్రశ్నించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కులం వేరు మతం వేరని చెప్పారన్నారు. 18 ఏళ్లు నిండిన వ్యక్తి నచ్చిన మతంను స్వీకరించే హక్కు ఉందని గతంలోనే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న క్రూస్మ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం తీసుకున్న విద్యార్థులకు గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని కడపజిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘం(క్రూస్మ) జిల్లా ప్రెసిడెంట్ లెక్కల జోగిరామిరెడ్డి, ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వర రెడ్డి, సాధన, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు గడువును ఇవ్వాలని వారు మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ట్రెజరర్ రామాంజనేయ రెడ్డి, బద్వేల్ క్రూస్మా ప్రెసిడెంట్ కుమార్, పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వల్లూరు (చెన్నూరు) : స్త్రీ వ్యాధులపై వైద్య శిబిరాన్ని బుధవారం చెన్నూరులోని నిస్సి ఫిజియోథెరపి క్లినిక్ లో నిర్వహిస్తున్నట్లు వైద్య నిపుణులు డాక్టర్ వై.ప్రమోద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వివరాలకు 9505046850 సంప్రదించాలని కోరారు.

మంచి నీళ్లు ఇవ్వండి.. మహాప్రభూ..

- విద్యుత్‌నగర్ వాసులకు అందని మంచినీరు
- ఉప్పు నీటి సమస్య పరిష్కరించాలని వేడుకోలు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని విద్యుత్ నగర్ (నెహ్రూ నగర్) 6వ వార్డులోని 3వ వీధికి మంచినీళ్లు సరిగా రావడం లేదని కాలనీ వాసులు తెలిపారు. కార్పొరేషన్ వాళ్లు మాత్రం నిత్యం మంచినీరు వదులుతున్నామని చెప్పినా.. అవి మాత్రం మాకు అందడం లేదని, అవి ఎప్పుడొస్తాయో మాకు తెలియదని స్థానికులు తెలిపారు. దీనికితోడు స్థానికంగా ఉండే బోరు మోటర్ (ఉప్పు నీళ్లు) నిరంతరంగా ఆడుతూ ఉంటుందని కార్పొరేషన్ వాళ్లు నీళ్లను వదిలినా ఆ నీరు స్థానికంగా ఉండే బోరుకు సంబంధించిన ఉప్పునీటితో కలిసి పోతోందని వారు వేదన చెందుతున్నారు. దీంతో మాకు మంచినీరు కరువయిందని వాపోతున్నారు. పోనీలే ఆ నీరు పట్టుకుని తాగుదామంటే ఉప్పగా, జౌకులుగా ఉంటూ తాగేందుకు వీలుకావడం లేదని తెలిపారు. తాగునీటిని స్థానికంగా డబ్బులిచ్చి కొనుగోలు చేసే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని పలు మార్లు కార్పొరేషన్ వారికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

గంటల తరబడి వృథాగా నీరు...

స్థానికంగా ఉండే బోరు నుంచి నిరంతరంగా నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతు న్నారు. నిర్ణీత సమయంలో మాత్రమే బోరును ఉపయోగిస్తే నీరు వృథా కాకుండా ఉంటుందని.. దీంతోపాటు స్థానికులకు మున్సిపాలిటీ నీరు అందే అవకాశం కూడా ఉంటుందని కాలనీవాసులు తెలిపారు.



విద్యుత్ నగర్‌లో ఉండే బోరు మోటారు

పలు మార్లు ఫిర్యాదు చేశాం



మా కాలనీకి మంచినీరు సరిగా రావడం లేదని పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. మంచినీళ్లలో ఉప్పునీరు కలిసి రావడంతో తాగేందుకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మంగమ్మ, స్థానికురాలు

సమస్య పరిష్కరించండి..



మా కాలనీలో మంచినీటి సమస్య వేధిస్తోంది. కాలనీలో ఉండే బోరు నిరంతరం ఆడుతుండటంతో కార్పొరేషన్ నీరు వదిలినా అందులోనే ఉప్పు నీరు కలసి వస్తున్నాయి. దీంతో మంచినీరు అందడం లేదు. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలి.

– చంద్రకళ, స్థానికురాలు

కార్పొరేషన్ నీటిని వదలినప్పుడు...



కార్పొరేషన్ వాళ్లు నీళ్లు వదిలినప్పుడు స్థానికంగా ఉండే బోరును ఆపితే మంచినీరు పట్టుకునేందుకు వీలుంటుంది. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల మధ్యలో నీటిని వదిలితే అందరం పట్టుకునేందుకు వీలుంటుంది.

– సావిత్రి, స్థానికురాలు

ఉచిత నైపుణ్య శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సీడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో కడప శిక్షణా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీడీయూ–జీకేవై పథకం ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, బ్యూటీ థెరపీ కోర్సులలో నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి, కంప్యూటర్ నైపుణ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, లైఫ్ స్కిల్స్ శిక్షణ కల్పిస్తామన్నారు. 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని తెలిపారు. వివరాలకు 90630 82227, 99664 48807 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తాం



ప్రయాణికుల సమస్యలు ఆలకిస్తున్న డిపో మేనేజర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన ప్రయాణికుల సమస్యలను ఆలకించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు కడప నుంచి పామూరు కు బస్సు సౌకర్యం కల్పించాలని, కడప నుంచి బద్వేల్ కు రాత్రి 8:30 తర్వాత వయా భాకరాపేట మీదుగా బస్సు నడపాలని, విజయవాడ వెళ్లే సర్వీస్‌లో పోరుమామిళ్లలో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కడప నుండి గాలివీడుకు నైట్ అవుట్ సర్వీస్ ఏర్పాటు చేయాలని, కడప నుంచి తిరుపతికి, తిరుపతి నుంచి కడపకి వచ్చే బస్సులు రాజంపేట పాత బస్టాండ్ మీదుగా వచ్చేలా చూడాలన్నారు. బస్టాండ్లలో ఉన్న స్టాల్స్ అన్ని వస్తువులు ఎమ్మార్పీ ధరలకే అమ్మేలా చూడాలన్నారు. ఎమ్మార్పీ రేట్లు కన్నా ఎక్కువ అమ్మే వారి గురించి ఫిర్యాదు చేసేందుకు వివరాలతో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

సింహ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం రాత్రి గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. గణపతిపూజ, కలశపూజ, మండపారాధన, దీక్షా హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నటరాజ కళా క్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల భక్తి గీతాలకు చేసిన కూచిపూడి, శాస్త్రీయ నృత్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సింహ వాహనంపై శివనామ స్మరణ మధ్య పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

అంత్యక్రియలు



మహిళ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళుతున్న 'మేము సైతం' సభ్యులు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని అంగడి వీధిలో లక్ష్మి అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆమె భర్త నాగరాజు, తన భార్యకు అంత్యక్రియలు చేయడానికి ఆర్థిక స్తోమత లేదని, మేము సైతం సేవా సంస్థను సంప్రదించారు. అతని విజ్ఞప్తి మేరకు మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో మోచంపేటలోని స్మశాన వాటికలో, హిందూ సాంప్రదాయం ప్రకారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాము, రామరాజు, షామియానా సురేష్, నరసింహ, నాగేశ్వరరావు, శివరాం, గురువయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీ సంక్షేమ నిధులు లూటీ

- కుట్టు మిషన్ల స్కీం కాదది ... పెద్ద స్కాం
- వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివరామ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కేటాయించిన నిధులను లూటీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శులు కె. శివయాదవ్, వి. శివయ్యయాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన ప్రతిసారీ బీసీలు వంచనకు గురవుతున్నారన్నారు. తాజాగా బీసీలను మోసం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీ స్కీం తీసుకొచ్చిందన్నారు. రూ.257 కోట్లతో రాష్ట్రంలో లక్షా 3వేల మంది బీసీ మహిళలకు శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, ఇందులో 65 కంపెనీలు పాల్గొనగా, 55 కంపెనీలను తిరస్కరించారని, మరో ఆరు కంపెనీలను డిస్క్వాలిఫై చేశారన్నారు. ఎల్1గా నిలిచిన శ్రీసిటీ టెక్నాలజీ కంపెనీకి నామమాత్రంగా ఐదు వేల కుట్టు మిషన్లు మాత్రమే అప్పగించి, ఎల్2, ఎల్3గా నిలిచిన రెండు కంపెనీలకు 98వేల కుట్టుమిషన్లు పంపిణీ చేసే బాధ్యత అప్పగించారన్నారు. ఈ రెండు కంపెనీల యజమాని ఒకరేనని తెలిపారు. ఈ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.23 వేలు ఇస్తుందని, ఇందులో కుట్టుమిషన్ రూ.4300, శిక్షణకు రూ.3000పోగా మిగిలిన డబ్బు టీడీపీ నేతల జేబుల్లోకి పోతోందన్నారు. సుమారు రూ.150కోట్లు మింగేసేందుకు స్కెచ్ వేశారన్నారు. జిల్లాల్లో ఏ ట్రైనింగ్ సెంటర్‌లోనూ సరైన మౌళిక వసతులు లేవన్నారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ మాట్లాడుతూ బీసీలకు కేటాయించిన నిధులను లూటీ చేసేందుకే ఈ స్కీంను తెచ్చారన్నారు. రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ గ్లోబల్ టెండర్లు కాకుండా జిల్లాల వారీగా టెండర్లు పిలవాలన్నారు. రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి కె. శివయాదవ్ మాట్లాడుతూ త్వరలో బీహార్, ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందు వల్లే బీసీ జన గణనను తెరపైకి తెచ్చారని విమర్శించారు. రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి శివయ్య యాదవ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు నేరుగా రూ.23వేలు డబ్బు ఇస్తే వారే నచ్చిన కుట్టు మిషన్లు కొనుక్కుంటారన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు సుబ్బరాయుడు, పార్వతీశం, మహిళా నేతలు పత్తి రాజేశ్వరి, ఉమా మహేశ్వరి, బండి మరియలు, క్రిష్ణవేణి, తులశమ్మ, సుశీలమ్మ, మల్లీశ్వరి, పద్మ, శ్రీదేవి, సునీత పాల్గొన్నారు.

పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న గుంటూరు పరిశోధన సంచాలకులు పివి సత్యనారాయణ

కడప అగ్రికల్చర్: రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూమి, వాయు, నీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని గుంటూరు ఆచార్య యన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు పివి సత్యనారాయణ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి రెండవ రోజు సమావేశం మంగళవారం ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధన సంచాలకులు సత్యనారాయణ మాట్లాడుతూ నానో యూరియా, నానో డి.ఎ.పి సమర్థత, స్థాయిని పరిశీలించాలన్నారు. అలాగే పరిశోధనా ఫలితాలను త్వరితగతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు.

– గుంటూరు ఆచార్య యన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా. జి. శివనారాయణ మాట్లాడుతూ రైతులు, విస్తరణ అధికారులు తమ సమస్యలను సలహాలతోపాటు సూచనలను అందించడం ద్వారా కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో తోడ్పడవచ్చునని తెలిపారు.

– తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డా.వి. సుమతి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, రైతులు విలువైన సూచనలు ఇవ్వాలని కోరారు.

– తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటకశాస్త్ర శాస్త్రవేత్త మురళీకృష్ణ పురుగు మందుల అవశేష నిర్మూలన పద్ధతులు, అడివి పందుల యాజమాన్యం గురించి క్షుణ్ణంగా వివరించారు. తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగ ప్రధాన శాస్త్రవేత్త ప్రతిమ ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికలపై సమగ్రంగా వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులు రైతులను పంటల వారిగా వివిధ బృందాలుగా ఏర్పరిచి ఆ పంటలలో వారు ఎదుర్కొన్న సమస్యలు, పరిశోధన అంశాల గురించి మేధోమధనం చేసి విస్తరణ కార్యక్రమ లక్ష్యాలను నిర్ధారించుకున్నారు.

– ఈ కార్యక్రమంలో ఊటుకూరు ఏఆర్ఎస్ సమన్వయకర్త డా. జి. ప్రభాకర రెడ్డి, ఏరువాక కేంద్ర సమన్వయకర్త అంకయ్య కుమార్, కేవీకే సమన్వయ కర్త వీరయ్య, శాస్త్రవేత్తలు సునీల్ కుమార్, డా. మాధురి, డా. శ్రీవల్లి, డా. భాగవత ప్రియ, డా. ప్రశాంతి, డా. వి. శిల్పకళ, డా. టి. మహేష్ బాబు, డా. కె. సాయి మహేశ్వరి, డా. యస్. మానస, డా. ఐ. సురేష్ కుమార్ రెడ్డిలతోపాటు ఐదు జిల్లాల పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

వేంపల్లె : రాయలసీమ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం గండి ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించాలని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి తెలిపారు. మండలంలోని గండి దేవస్థానాన్ని మంగళవారం స్థానిక బీజేపీ నాయకులతో కలసి ఆయన పరిశీలించి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.26 కోట్లతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టి నాలుగేళ్లు గడుస్తున్న ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. నాలుగేళ్ల నుండి స్వామివారిని బాలాలయంలో దర్శించుకుని భక్తులు వెను తిరుగుతున్నారన్నారు. ఏటా రూ.5 కోట్ల ఆదాయం ఉన్న అతిపెద్ద దేవాలయం గండి క్షేత్రమని, ఇంత ఆదాయం ఉన్నా. ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. శ్రావణ మాసంలోపు ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు గండి ఆలయ పునర్నిర్మాణం పనులపై శ్రద్ధ పెట్టి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించాలన్నారు.



దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పత్రికా స్వేచ్ఛను హరించేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: పత్రికా స్వేచ్ఛను హరించేలా కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి వ్యాఖ్యలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొట్టిపాటి జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకుల అక్రమ సంపాదనకు హద్దులు లేకుండా పోయాయని, ఖాళీ స్థలాలు, ఇసుక, మట్టి, మద్యం ఇలా దేనిని వదిలిపెట్టకుండా దోచుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే అండ చూసుకునే వారు ఇలా అక్రమాలకు పాల్పడుతున్నారని, టీడీపీ నాయకుల కబ్జాలను, అక్రమాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్న పత్రికలపై ఎమ్మెల్యే అక్కసు వెళ్లగక్కడం సరైంది కాదన్నారు. పాత కడప చెరువు కబ్జాపై అన్ని పత్రికలు, ఛానెళ్లు కోడై కూస్తున్నాయన్నారు. చెరువుకు సంబంధించిన భూమిలో 300 ట్రిప్పుల మట్టి తోలారని, వాటాల్లో తేడాలు రావడం వల్లే ఈ కబ్జా వెలుగులోకి వచ్చిందన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఎందుకు భుజాలు తడుముకొంటున్నారో అర్థం కావడం లేదన్నారు. మొన్న ఎమ్మెల్యే పీఏ వాహిద్ ఒక అమ్మాయిని పెళ్లి చేసుకొని ఆమె సోదరుడిపై అర్ధరాత్రి దాడి చేయించారు. నిన్న మద్రాసు రోడ్డులో ప్రియా ఐస్‌క్రీం పార్లర్ పక్కన వాచ్‌షాపు యజమానిని టీడీపీ నేత బెదిరించి రూ.5లక్షలు డబ్బులు డిమాండ్ చేశారు... వీటిపై బాధితులే మీడియా ముందుకొచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని చెబుతున్నారు. తన అనుచరులను నియంత్రించుకోలేక ...... వాస్తవాలను ప్రచురించి, ప్రసారం చేస్తున్న పత్రికలు, ఛానెళ్లపై ఎమ్మెల్యే ఎదురుదాడి చేయడం అన్యాయమన్నారు. మహానాడు కడపలో కాకుండా కమలాపురంలో ఏర్పాటు చేస్తుండటం...ఎమ్మెల్యేల పనితీరుపై చంద్రబాబు తలంటడం వల్లే ఎమ్మెల్యే మాధవి అసహనానికి గురవుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అందుకే సంయమనం కోల్పోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తన వెంట ఉన్నవారు చేస్తున్న తప్పులను సరిదిద్దుకోకపోతే అంతిమంగా ఎమ్మెల్యే మాధవి ఇబ్బందుల్లో పడక తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సెంటు స్థలం కబ్జాకు గురైనా తాటతీస్తానన్న ఎమ్మెల్యే తన ఆర్ఎస్‌ఆర్ స్క్వైర్ మాల్‌లో నాలుగు సెంట్ల ఆక్రమణను మర్చిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సింధు పాల్గొన్నారు.

హిందీ, సంస్కృతం పోస్టులను కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో కాంపోజిట్ హిందీ, సంస్కృతంతోపాటు ఇతర భాషల పోస్టులను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిట్ పరిషత్తు జిల్లా అధ్యక్షులు ఎఫ్ఎంఎస్ ఖాదర్‌బాష, గౌరవాధ్యక్షులు నరసింహారెడ్డిలు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నుండి కొనసాగుతున్న కాంపోజిట్ విధానాన్ని తొలగించే ప్రయత్నం వల్ల వేలాదిమంది విద్యార్థులు జాతీయ భాషను అభ్యసించే అవకాశం కోల్పోతారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఇదే విషయమై పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుల కార్యాలయ ఏడీ విజయ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించి విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ నాయకులు ఎస్ఎండి ఖాజా మొద్దీన్, కరీముల్లా, పోసా శ్రీనివాసులు, మహమ్మద్ గౌస్, ఫయాజుర్ రెహమాన్, నజీర్ బాష, అబ్దుల్ రజాక్, ఖదీర్ పర్వేజ్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆర్టీసీ నమ్మకాన్ని నిలబెట్టాలి



డ్రైవర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారు సంస్థ నమ్మకాన్ని నిలబెట్టేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో ప్రమాదాలకు కారణమైన ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ ప్రతినిధులు డ్రైవర్లకు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యాన ప్రక్రియల గురించి తెలియజేశారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్క డ్రైవరు ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకొని ఆ నీటిని సేవించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ ఇంధన పొదుపు పై పంచ సూత్రాలను తెలియజేశారు. మధ్యాహ్నం డ్రైవర్లకు బ్లాక్ స్పాట్‌పై అవగాహన కల్పించే ఉద్దేశంతో స్పాట్‌లోకి తీసుకెళ్లి ప్రమాదాలపై అవగాహన కలిపించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోలకు చెందిన 17 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

మేజర్ విజయభాస్కర్ సేవలు అభినందనీయం



మేజర్ చెరుకుపల్లి విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న కడప ఆఫీసర్స్‌క్లబ్ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగంలో 30 సంవత్సరాల పాటు అధ్యాపకుడుగా, ఎన్‌సీసీ అధికారిగా సేవలందించిన మేజర్ చెరుకుపల్లి విజయభాస్కర్ సేవలు అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, ఎన్‌సీసీ విశ్రాంత అధికారి మేజర్ సి. విజయభాస్కర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుడుగా, ఎన్‌సీసీ అధికారిగా విజయభాస్కర్ అందించిన సేవలను ప్రస్తుతించారు. అనంతరం విజయభాస్కర్‌ను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు రవి, బాలగొండ గంగాధర్, లేబాక మధుసూదన్‌రెడ్డి, జానుమద్ది విజయభాస్కర్, రమణకుమార్, సాంబశివారెడ్డి, చిన్నపరెడ్డి, సుబ్బరాయుడు, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

నేడు వాసవీ జయంతి

వల్లూరు : స్థానికంగా ఉన్న శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి శాలలో బుధవారం వాసవీ మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం రాత్రి భజన కార్యక్రమం ఉంటుందన్నారు.